
**చీకటిలో వున్నవారు ఒక్కసారి వెలుతుర్లోకి వస్తే కళ్ళు బైర్లు కమ్ముతాయి. ఈ మారుతున్న విలువలు సంస్కృతి మనల్ని ఎక్కడకు తీసుకు వెళ్తున్నాయని ప్రశ్నిస్తున్నారు రచయిత్రి!**




# రేవతి

మాదిరెడ్డి సులోచన

ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. సుపీరియారిటీ కాంప్లెక్స్ చాలా మందిని బాధిస్తుంటాయిగాని మా రేవతిని బాధించేది కొత్త రకమయిన కాంప్లెక్స్. తన బాధను ఒకరితో చెప్పుకునేది కాదు. చెప్పుకున్నా సానుభూతి దొరకడం దుర్లభమే అనుకుంటాను. రేవతి, నేను బి. ఏస్సి. పాసవగానే ఒక ప్రయిమరీ స్కూల్లో టెంపరరీ టీచర్స్‌గా పని చేశాము. నాకంటే ప్రతి విషయంలోను చురుకయింది. తను విసిరే విసుర్లకు అందరూ నవ్వేవారు. తను ఎమ్మెస్సీ చేయటానికి వెళ్ళింది. నేను బి. ఇడి. కి వెళ్ళాను.

తరువాత తన గురించి రకరకాలుగా చెప్పారు కాని. నేను పట్టించుకోలేదు. పనిపాట లేనివారు బోలెడు కల్పిస్తారని అనుకున్నాను. ఎందుకంటే మన సంఘంలో అన్నం నీరు తరువాత పోచుకోలు కబుర్లు కడుపు నింపుతున్నాయి. మా శ్రీవారు జాంబియా నుండి ఇండియాకు వచ్చారు. అప్పుడు ఉగాండాలో అల్లర్లు జరుగు




తున్నాయి. జాంబియా, ఉగాండా యెక్కడుంటాయో తెలియని ఒక ఎమ్మెస్సీ నా ఫ్రెండ్‌తో 'ఫలానా వారి భర్తను అల్లర్లు అవుతుంటే వెళ్ళగొట్టారు' అన్నదట. పాపం ఈ మనిషి హైరానాపడి వచ్చి అడగలేక అడగలేక అసలు సంగతి అడిగింది. ఆ రెండు దేశాలు వేరని, వార్తా పత్రికలలోని వార్తలు చూసి నమ్మింప జేయవలసి వచ్చిందామెను.

అలాగే ఒకసారి నేను, మా అన్న షాపింగ్‌కు వెళ్ళాము. మా ఇద్దరిని దీక్షగా చూస్తే పోలికలు కనిపిస్తాయేతప్ప, ఆయనది మంచి రంగు. అకస్మాత్తుగా చూస్తే అన్నా చెల్లెలని అనుకోరు. మాకు తెలిసిన ఉడుకుమోతు స్త్రీ చూసి "ఫలానా ఆమె భర్త దేశంలో లేడని షికార్లు జోరుగా చేస్తుంది" అని ప్రచారం మొదలుపెట్టింది. నేను శ్రీవారి దగ్గరకు వెళ్ళేటప్పుడు టీ పార్టీకి అందరిని పిలిచి మా అన్నను పరిచయం చేస్తే, తన అపచారం గ్రహించిన ఆ 'స్త్రీ మీ అన్నా' అంటూ తెల్ల మొహము వేసింది. అందుకే నీలి వార్త త్వరగా నమ్మను.

"ఏమోయ్ క్రాంతీ! మీ ఫ్రెండు అదే రేవతి ఇక్కడికి జువాలజీ టీచర్‌గా వస్తొంది." మా బడిలో పనిచేసే హిందీ టీచర్ చెప్పింది. ఆమె యెప్పుడూ తాజా తాజా వార్తల్ని అందిస్తుంది.

"ఎంత శాతము నిజమో!"

"నూటికి రెండువందల పాళ్ళ-సరా?" ఆమె మాట పూర్తి కాకముందే నా చూపులు దూరాన నడుస్తున్న స్త్రీ పైన పడ్డాయి. బాబ్డ్ హేర్, బొడ్డు క్రిందికి చీర, అయిదంగుళాల ఎత్తు మడిమల జోళ్ళు, క్రీమ్‌తో తళతళ లాడుతున్న ముఖం, నీలిరంగుతో టచప్ చేసిన కనురెప్పలు, బొమ్మల నడుమ నల్లని బొట్టున్నాయి. ఒకే ఒక గుర్తువల్ల రేవతని గుర్తుపట్టాను. పెదవులమీద చెరగని చిరునవ్వు.

"రేవతీ...." లేచి యెదురు వెళ్ళాను.

"హాయ్!" చెయ్యూపి యెగాదిగా చూసింది. సగర్వంగా భుజాలు ఎగురవేసింది.

"యూ ఓల్డ్ డేమ్! ఏమీ మారలేదు. జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి వస్తాను" తను వెళ్ళిపోయింది. నవ్వుకుని క్లాసుకు వెళ్ళిపోయాను. మర్నాడు లాబ్‌లో నిల్చుని అలమరాలు తుడిపిస్తున్నాను. హడావుడిగా మా లెక్కల టీచర్ వచ్చింది.

"అబ్బబ్బ! క్రాంతీ! స్టాఫ్‌రూమ్‌లో కూర్చోవటం దుర్భర మయిందోయ్!" అన్నది తల పట్టుకుని.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"నీ ఫ్రెండ్ నోటికి హద్దూ పద్దూలేదు. ప్రతి ఆడదానికో రంకు మొగుడుంటాడట. చెడిపోని స్త్రీ పురుషులంటూ లేరట. ఒక టేమిటి పందలు...." ఆమె చెప్పినవి విని అప్పుడే మరిచిపోయాను. పిల్లలు వచ్చే సమయమయింది. ఎక్స్‌పరిమెంట్ చేయడంలో నిమగ్నమయిపోయాను.

ఆ రోజు నాకు ఒక పీరియడ్ ఖాళీ. స్టాఫ్‌రూమ్‌కు వచ్చాను. రేవతి ఉపన్యాసం ఫుల్‌స్టాప్ కామా లేకుండా సాగుతుంది.

"ఈ సృష్టిలో ఒక స్త్రీ, ఒకే పురుషుడితో ఉందంటే నేను నమ్మను. కొందరు ధైర్యంగా చేస్తారు. కొందరు చాటుమాటు వ్యవహారాలు సాగిస్తారు. ఇది సృష్టి రహస్యం...."

"రేవతీ!...." పిలిచాను.

"ఓ.... వ్హాట్ ఓల్డు డేమ్" ఇటు తిరిగింది.

అక్కడ కూర్చున్న ముసలి మాష్టారు లిద్దరు, డ్రిల్లు మాష్టారు ఆంథోని చెవులు విప్పి విన్నంత శ్రద్ధ కనపరుస్తున్నారు.

"స్టాఫ్ రూమ్‌లో కామన్, ఇంటరెస్ట్ ఉన్న విషయాలు మాట్లాడాలి." అన్నాను.

"ఓయ్.... మతి వుందా? సెక్స్‌కన్నా ఇంటరెస్ట్ అయిన విషయాలు ఏముంటాయి! ఇది కామన్ ఇంటరెస్ట్ అయిన టాపిక్."

"నీ సిద్ధాంతము మాత్రం కామన్ కాదు "

"ఏమ్మా! అఫెయిర్ లేకుండా ఒక్కర్ని చూపించు. నేనిలా చేశాను అనే ధైర్యం యెందరికి వుంది!"

"రేవతిగారూ! యెవరి అఫేర్స్ వారికుంటాయేమో. లేవన్న వారితో ఛాలెంజి చెయ్యండి. స్టాఫ్ రూమ్‌లో విచ్చలవిడిగా మాట లెందుకు?" హిస్టరీ టీచర్ వినోదిని అసహనంగా అంది.

"బెడ్రూమ్‌లో అయితే బావుంటాయా!" నవ్వుతూ అడిగింది.

'ఛ....మీతో మాట్లాడడం నాదే తప్పు' వినోదిని లేచిపోయింది. నేను రేవతి దగ్గరగా వెళ్ళాను.

"యెందుకు రేవతీ! ఇంటరెస్ట్ ఉన్న వాళ్ళ దగ్గర మాట్లాడు, పెళ్ళికాని అమ్మాయి, కాస్త ఇబ్బందిగా ఫీలవుతుంది...."

"ఏమ్మా! .... మొగాడి ముఖమే ఎరగవా!" నోటితో చెప్పలేనంత పచ్చిగా అడిగింది. అక్కడున్న మొగవారికి ముఖం చూపించలేక నేను వెళ్ళిపోయాను. మాటలతో ఆగినా బావుండును. అక్కడున్న మొగ ఆడకు ఏవో సంబంధాలు అంటగట్టేది. ఆమెను చూస్తే ప్రతివారు జడుసుకునేవారు. బావి, చెరువు ముయ్యవచ్చుగాని నోరెలా మూస్తాం. ఒకటి రెండుసార్లు వినోదిని హెడ్‌మిస్ట్రెస్‌తో చెప్పింది. ఆమె వార్నింగ్ ఇచ్చింది.

మర్నాడు రేవతి నా దగ్గరకు వచ్చింది.

"క్రాంతీ ఓ విషయం తెలుసా?" ఏమిటన్నట్లు చూశాను. ముందుకు వంగి దగ్గరగా వచ్చింది.

"అదే మన హెడ్డి మొహము... హెడ్ మిస్ట్రెసోయ్ ఆక్లర్క్ గాడితో కులుకుతుంది" అన్నది.

"రేవతీ!" నా ఆశ్చర్యానికి అంతులేదు. యెందుకు రేవతి ఇంతగాదిగజారిపోయింది. యాభై మూడేళ్ళ స్త్రీ మా హెడ్ మిస్ట్రెస్. తల పండిపోయింది. ఒళ్లు వచ్చి ఆయాసంగా తిరుగుతుంది. క్లర్కు రామనాధం ఇరవై రెండేళ్ళ కుర్రవాడు. ఆమెను చూస్తే నోటిమాట రాదంటాడు.

"ఏమిటోయ్ అంతలా ఆశ్చర్యపోతున్నావు. అది ప్రకృతి సిద్ధాంతము. వయసులో తేడా అనుకుంటున్నావేమో" నవ్వింది.

"అలాంటివారిమధ్య శృంగారమేం పండుతుంది?"

"ఛ.... రేవతీ అలాంటివి ఊహించటానికి కూడా జుగుప్సగా ఉంది" అన్నాను కంపరంగా.

"అవును మరి. మనిషిలోఉన్న బలహీనత అదేనోయ్. జుగుప్సాకరంగా ఉందంటూనే దాని వెంట పరుగెడతాడు. ఇదొక్కటేనా ఎవరికి ఎవరితో సంబంధముందో చెప్పమంటే చెబుతాను." వేదాంతిలా, తత్వవేత్తలా పోజు పెట్టింది. నాకు ఒళ్ళు మండిపోయింది.

"నా రంకుమొగుడెవరో చెప్పు" అన్నాను.

"క్రాంతీ!" అనుకోని ఈ ప్రశ్నకు తెల్లబోయింది. రేవతి ముఖం వెల వెలబోయింది. ఒక్క నిముషం మాట్లాడలేనట్టు నన్ను చూస్తూ ఉండిపోయింది.

"రేవతీ! స్త్రీ అంటే బొమ్మని, విలాస వస్తువు అని చాటిచెప్పుకునే నీలాంటివారు స్త్రీ విముక్తి గురించి మాట్లాడుతారు. ఎంగిలి కూటికి ఎగబడినట్టు సెక్స్ అంటే నీకు పిచ్చి వుందేమో. ఆ పిచ్చి జనరలైజ్ చేసి అందరికి అంటగట్టకు జాగ్రత్త! ఇక మీదట రంకు మొగుళ్ళు, స్త్రీ పురుష సమావేశాలు అంటూ స్కూల్ ప్రిమిసెస్‌లో మాట్లాడు చెబుతాను" అరిచి బయటికి వచ్చాను. స్టాఫ్ రూమ్‌కు వచ్చి కూర్చున్నాను. అక్కడ మగవారుచేరి ఇదే చర్చ జరుపుతున్నారు. ముఖాన పట్టిన చమట తుడుచుకున్నాను.

"ఆవిడన్నట్టు తాముచేసినపని అంగీకరించడం స్త్రీ లందరికి సాధ్యం కాదు." వెంకయ్య మాష్టారు పెదవులు చప్పరించేశాడు.

"స్త్రీ అందుకే బూజువాగా తయారవుతుంది." అంథోని అంటున్నాడు.

"ఏమయినా తన ప్రణయ చరిత్ర ఇంత బహిరంగంగా చెప్పే రేవతి అభినందనీయురాలు."

"ఒహో! ఏం విశాల హృదయమండీ. మీ భార్యకేదయినా ప్రణయ చరిత్ర అంటూ ఉంటే ఆమెను బహిరంగంగా చెప్పనిచ్చి, మీరానందిస్తే మీ విశాల హృదయానికి జోహార్లు పట్టేదాన్ని" అన్నాను వెటకారంగా.

"మా వాళ్ళు అలాంటివారు కాదు. అంతకు దిగజారలేదు" ఆంథోని ముఖం కందగడ్డలా అయింది.

"ఆ లోటి స్త్రీ విచ్చల విడిగా తిరిగితే అభినందనీయురాలు. మీ స్త్రీ మాట' వచ్చేటప్పటికి మాటలకు కట్టుబాటు యెందుకో? రేవతికి మతి చలించిందేమో, వాగుడు పిట్టలా తయారయింది. దాని వాగుడు ఆధారంగా మీరు పరాయి స్త్రీలను గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దు" అన్నాను శాసించినట్టే. హెడ్ మిస్ట్రెస్‌కు, విద్యార్థులకు నాపట్ల అభిమానమని పీళ్ళు కాస్త అభిమానంగానే ఉంటారు. అభిమానంతోనయితేనేం, జడుసుకుని అయితేనేం అప్పటికి ఊరుకున్నారు.

స్త్రీ పురుషుల సంబంధాలు ఎలా వుంటాయన్నది రిసెర్చి చేయకపోయినా, సమయంతో పరుగెత్తే ఈ యుగంలో మధ్యతరగతి కుటుంబాలలో భార్యాభర్తలే తమకున్న కాలాన్ని వినియోగించుకోవటం దుర్భరమయింది., ఇతరత్రా ఆలోచించే సమయం యెక్కడ! యెక్కడో పనిలేని వారు, కుటుంబానికి దూరంగా ఉండేవారు, సాంఘిక పరిస్థితులను యెదురు కోలేక తమ చుట్టూ ఓ పరిధి గీసుకున్నవారు తప్పితే, శృంగారం, చట్టుబండలు అంటూ ఏదయినా దొరికితే సినిమాల్లో దొరకాల్సిందే. భార్యాభర్తల అనుబంధం అనండి, లైంగిక జీవితం అనండి అది కూడా యాంత్రికమయిన చర్యల్లో ఒకటిగా మారిపోతుంది. ఎక్సెప్షన్స్ వున్నాయి అది వేరే సంగతి. ఈ మధ్య జనంలోకంటే సాహిత్యంలో ఈ సెక్స్ పర్వర్షన్స్ కనిపిస్తున్నాయి. వాటిని ఇంటలెక్చువల్ స్టాండర్డ్ అంటున్నారు. జీవితాన్ని ప్రతిబింబింపజేయాలి అంటారు సాహిత్య చర్చలో సమకాలీన జీవితాన్ని ప్రతిబింబింపజేసేది ఉత్తమ సాహిత్యమంటారు. కాని అడ్డదారి పట్టిన సాహిత్యాన్ని అహ అంటే ఒహో అంటున్నారు. దాంతో రేవతిలాంటి వారి మతి చక్రంలా తిరుగుతుందేమో!

రేవతి గురించి అందరం ఆలోచించడమే మానేశాం. ఎవరెవరో స్కూటర్ల వెనకాల ఎక్కి వచ్చేది. చిన్నా పెద్దా అన్న భేదం లేకుండా వాడు తన వెంట ఎలా పడుతున్నాడో చెప్పేది. నవ్వి ఊరుకునే స్థితికి వచ్చేశాం. పరీక్షల గొడవలో పడి స్టాఫ్ రూమ్‌కేసి వెళ్ళలేదు. వారం పది రోజులకు వెళ్ళి చూద్దునుకదా, రేవతి నెల రోజులు సెలవు పెట్టిందని తెలిసింది.

"పెళ్ళేమో!" యెవరో అన్నారు.

"ఆమెను పెళ్ళి చేసుకునే ధైర్యం ఏ మొగాడి కుందండీ" ఒక మగ మాష్టారి ప్రశ్న.

"ఆమె కబుర్లు కమ్మగా వినే మీలాంటి వారుచాలామందిఉన్నారు" అన్నాను. అతను ముఖం చిటపట లాడించేడు. మగవాడి బలహీనత అని అనను స్త్రీ అబలత్వమే అతని తత్వం గుర్తించకుండా చేస్తుంది. తన స్త్రీకో ధర్మం, పరాయి స్త్రీకి మరో ధర్మం అన్న భావన పోయిననాడే నిజమైన మార్పు వచ్చిందని ఆశించాలి.

సెలవులిచ్చారు. సెలవులు అయిపోవచ్చాయి. సెలవుల్లో చెయ్యాలనుకున్న పనులు ఏవీ పూర్తి కాలేదు. ఏ ఆటంకమూ లేకుండా అప్పడాలు ఒత్తించాలని అనుకుంటుండగా ఓ కుర్రాడు చీటీ తెచ్చి ఇచ్చాడు. రేవతి రాసింది, అక్షరాలు అలుక్కుపోయినట్టున్నాయి! తను ఏదో ప్రయివేటు నర్సింగ్ హోమ్ అడ్రసు ఇచ్చింది. ఆ సాయంత్రం వెళ్ళాను. రేవతిని చూడగానే అసలు సంగతి అర్థం అయింది. ఆరోగ్యశాస్త్రంలో చదివిన సుఖరోగాల చిహ్నాలు కనిపించాయి.

"రేవతీ!" అన్నాను బాధగా. అందంగా చలాకీగా ఉండే రేవతేనా! నమ్మశక్యం కావటం లేదు.

"నాకు తెలుసు క్రాంతీ, నువ్వు వస్తావని, నీకు నా వాచాలతమీద కోపంకాని నామీద లేదని తెలుసు...." ఆప్యాయంగా చెయ్యిపట్టుకుంది? ఆమెకు మంచి డాక్టరును చూడమని చెప్పాను.

"క్రాంతీ! నిన్నెందుకు పిలిచానో తెలుసా?"

"డబ్బేమయినా కావాలా?"

ఉచితము ! ఉచితము !

# తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

LALIT AYURVEDIC PHARMACY (AJ)
P.o. Katrisarai (GAYA)

"అది ఒక కారణమే అనుకో. కాని నేను ఫెయిలయింది అందుకు కాదు. నా హృదయంలోని బాధను దింపుకుందామని. నువ్వన్నట్టు స్త్రీ తన అబలత్వంతో పురుషుడికి లొంగిపోతుందే. ఎందుకో ఫస్ట్‌లో కూడా ఇంకా ఫస్ట్ రావాలని ఆశ పట్టుకుంది. అందుకే ఒక మూర్ఖుడు చెప్పిన మాటలు విని అతనికి లొంగిపోయాను. తరువాత అతనో బోగస్ అని తెలిసిపోయింది. వాడు నా విషయం యూనివర్సిటీ అంతా చెప్పాడు. ఓ ప్రొఫెసర్ నన్ను కోరినప్పుడు "కోర్కె తీర్చకపోతే నిన్ను ఫెయిల్ చేస్తా"నని అనలేదు కాని, చేస్తాడని నేను భయపడి లొంగిపోయాను....అలా జారుడు బండమీదనుంచి దొర్లే బంతిలా దొర్లాను...."

"సరే ఇప్పుడు ఆ విషయాలు ఎందుకు? మందులు. విశ్రాంతి తీసుకో, ప్రతివాడు తప్పు చేస్తాడు. అది తప్పని తెలుసుకోవడంలో ఉంది గొప్ప. ఇక మీదట జాగ్రత్తగా ప్రవర్తించు" అన్నాను ఆమె చేయి నిమురుతూ. "నా ఆరోగ్యం దిగజారిందనే చింత లేదు. మందులున్నాయికాని మిమ్మల్నందరిని నాలాంటి వారనుకుని తృప్తిపడ్డాను, నా తృప్తి కోసం అందరికీ రంకు అంటగట్టాను. అందుకు కోపగించక, క్షమించు." కళ్ళనిండుగా నీళ్ళు నింపుకుని అర్థించింది. నాకు రేవతిని చూస్తే జాలి వేసింది. పయసు బరువు. మనిషి పరువుతో ఆడుకుంటుందేమో.

"ఫరవాలేదు! నీ కాంప్లెక్స్ యెప్పుడో అర్థం చేసుకున్నాం. ఉపాధ్యాయులుగా ఆమాత్రం అవగాహనం చేసుకోకపోతే ఇక ఎందుకు?" చెప్పాతూ రేవతిని ఓదార్చాను. మరో అరగంట వుండి, తమ అడిగిన డబ్బు ఇచ్చి బయటికి వచ్చాను.

ఈ మారుతున్న విలువలు, సంస్కృతి మనల్ని ఎక్కడికి తీసుకుపోతుంది? అందుకే అన్నారు చీకటిలో వున్నవాడు ఒక్కసారి వెలుతురులోకి వస్తే గుడ్డివాడవుతాడని. ఒక్కసారి కట్టుబాట్లు సడలిస్తే రేవతిలా పడటం అవుతుంది. మంచి చెడు ఉపోద్ఘాతం తరువాతే స్వేచ్ఛ ఇవ్వాలేమో?

మూడు నెలల తరువాత బడికి వచ్చిన రేవతిని చూసి 'ఎవరూ ఆమేనా?' అనుకుని నమ్మలేకపోయాను. కాంప్లెక్సు నుంచి బయటపడిందేమో, ముభావంగా, క్లుప్తంగా మాట్లాడింది. ★




సప్తగిరి ట్రేడర్స్ రాజమండ్రి-3

ఆల్ కరెక్ట్‌కు రూ 20,000లు

త్వరపడండి రూ. 25000లు గెలవండి

ఒక ఎంట్రీ రు. 1-00, 6 ఎంట్రీలు రు. 4-00, 25 ఎంట్రీలు రు. 15-00

ముగింపు : 12-2-77 కీ సొల్యూషన్ 19-2-77 ఆంధ్రప్రభ వీక్లీలో

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | భ | క్త | | | | | |
| 2 | | | కు | టుం | బం | | |
| 3 | అ | గ్గి | | | | | |
| 4 | | | కా | పు | రం | | |
| 5 | | | | బా | బు | | |
| 6 | బం | గా | రు | | | | |
| 7 | | | | బు |ల్లో | డు | |
| 8 | | | మ | న | సు | లు | |
| 9 | నిం | డు | | | | | |
| 10 | | | కో | ట | ఠ | హా | స్యం |

ఆధారములు :

1) వాణిశ్రీ నటించిన వర్ణ చిత్రం.
2) A. N. R., కాంచన కలసి నటించిన చిత్రం.
3) N. T. R., రాజశ్రీ కలసి నటించిన చిత్రం.
4) కృష్ణ నటించిన చిత్రం.
5) శోభన్‌బాబు నటించిన చిత్రం.
6) A. N. R. నటించిన చిత్రం.
7) చంద్రకళ నటించిన వర్ణ చిత్రం.
8) A. N. R., సావిత్రి కలిసి నటించిన చిత్రం.
9) N. T. R. నటించిన చిత్రం.
10) N. T. R., దేవిక కలిసి నటించిన చిత్రం.

నిబంధనలు : 1) అసంపూర్తిగా ఇవ్వబడిన సినిమా పేర్లను ఆధారముల సహాయముతో పూర్తిచేసి తెల్లకాగితముపైగాని, ఈ కూపను కత్తిరించిగాని పంపవచ్చును. 2) M. O. రశీదు జతపర్చవలెను లేదా I. P. O. క్రాసు చేయకుండా సప్తగిరి ట్రేడర్స్, రాజమండ్రి-3 అని వ్రాసి పంపండి. 3) M. O. రశీదు లేని ఎంట్రీలు I. P. O. పైమాదిరిగ తీసుకున్నను, ముగింపు తేదీ తర్వాత పంపిన ఎంట్రీలు పరిశీలించబడవు. 4) ఒకరు ఎన్ని ఎంట్రీలయినా పంపవచ్చును. ఎన్ని బహుమతులయినా పొందవచ్చును. 5) మేనేజిమెంటు వారిదే తుది నిర్ణయం. 6) బ్యాంకులో సీలు చేసిన కవరులోని కీ సొల్యూషన్‌తో సరిపోని ప్రతిమాట తప్పుగా లెక్కించబడును. 7) వివాదములు రాజమండ్రి కోర్టులోనే పరిష్కరించుకోవలెను. 8) కీ సొల్యూషను, విజేతల లిస్టు, పోటీ నెం. 3 కు 40 పైసల స్టాంపులు పంపండి. 9) ఎంట్రీలపై మీ పూర్తి చిరునామా వ్రాయండి. 10) మీ ఎంట్రీలు, M. O.లు ఈ అడ్రసుకు పంపండి :

SAPTAGIRI TRADERS, Danavaipet (P. O.), RAJAHMUNDRY-533 103.